




# ఈకాలం
THE HONEST TELUGU DAILY








శనివారం 21-03-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :141 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల


## మరోమారు పెరిగిన బంగారం ధరలు

### పదిగ్రాముల బంగారంపై 650 పెరుగుదల

### లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు

మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ.5 వేల మేర తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు




2లో..

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు

### నేడు పవిత్ర రంజాన్ పండగ

పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల ఆనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది.



2లో..

## రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్..

### ప్రవేశపెట్టిన భట్టి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగాన్ని ప్రారంభించారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

**బడ్జెట్ స్వరూపం**

మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు
రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు
మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు
బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..
1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు
జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు
ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటన
ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం
ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు
ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం
రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన
వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
విద్యా శాఖకు రూ.26,674 కోట్లు




2లో

## శ్రీవారికి 20 లక్షల విరాళం అందచేత



2లో..

## రానున్న 24 గంటల్లో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు



2లో..

## అమెరికా ఎఫ్-35ని ఢీకొట్టామిలా..

### వీడియో రిలీజ్ చేసిన ఇరాన్



2లో..

## గోదావరిలో ఐదుగురు గల్లంతు

### ఇద్దరి మృతదేహాలు లభ్యం మిగిలిన ముగ్గురి కోసం గాలింపు



2లో..

## అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

- దెబ్బతిన్న పలు రకాల పంటలు
- భారీగా నష్టపోయామని ఆందోళన
- రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు



2లో..

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం.. సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు

దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు తీసుకొచ్చారు. పేజి 2లో ▶



# సంపాదకీయం

## అమెరికా వెలుగులకు క్యూబన్ చీకట్లు ఎందుకు?

'క్యూబా విషయంలో నేను ఏమనుకుంటే అది చేయగలను.. దాన్ని స్వాధీనం చేసుకునే గౌరవం నాకు లభిస్తుందని భావిస్తున్నాను' నాలుగురోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. ఇరాన్ మీద మొదలుపెట్టిన అధర్మయుద్ధంలో కూరుకుపోయి ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో మరో దేశాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లుగా ఈ వ్యాఖ్యలను బట్టి అర్థం అవుతోంది. ఇటీవల కాలంలో వెనెజువెలాతో మొదలైన ప్రభుత్వాధినేతల మార్పు, అనుకూల రాజ్యాల ప్రతిష్ఠాపన పరంపరలో త్వరలో క్యూబా చేరబోతోంది. అమెరికాతో విభేదించి, దాని సామ్రాజ్య కాంక్షలకు గండికొట్టి, నచ్చిన మార్గంలో స్వతంత్రంగా వ్యవహరించిన దేశాల్లో ఒకప్పుడు క్యూబాకు ప్రముఖస్థానం ఉంది. పశ్చిమాసియాలో అమెరికా ఆధిపత్యానికి ఇరాన్ ఒకరకంగా 1979లో సవాలు విసిరితే అంతకు 20 ఏళ్లకు ముందు క్యూబా అంతకుమించిన సాహసాన్ని, ధిక్కారాన్ని ప్రదర్శించింది. ఇరాన్‌లో 1979 నాటి ఇస్లామిక్ విప్లవం దాని చుట్టూ ఉన్న కొన్ని ముస్లిందేశాల పాలకులను భయపెడితే, 1959 నాటి క్యూబన్ విప్లవం లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా దేశాల్లో ఎందరికో ఉత్తేజంగా నిలిచింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ముఖ్యంగా సొంత ఖండంలో తనకు తిరుగులేదనుకున్న అమెరికాకు క్యూబా పక్కలో బల్లెంలా మారింది.

అమెరికా కోరుకున్న రాజకీయ వ్యవస్థలను ఏర్పాటుచేయలేని, కావాలనుకునే ఆర్థిక విధానాలను అమలుచేయలేని చిన్న, మధ్యస్థాయి దేశాలకు వరుసగా ముప్పు ముంచుకొస్తోందని ట్రంప్ వ్యాఖ్యలను చూస్తే తేలికగా అర్థమవుతుంది. పరిస్థితి అంతమేరకే పరిమితమయ్యేలా ఉందని కూడా చెప్పలేం. భారత్ లాంటి పెద్దదేశమే ఎటూ నోరు విప్పలేని స్థితిలో ఉంది. రష్యా నుంచి చమురు కొనొద్దని శాసిస్తే అమలుపరచాల్సిన అగత్యం ఏర్పడింది. ఇరాన్‌పై దాడులతో ఏర్పడిన ఒడుదుడుకులను ఎదుర్కోటానికి రష్యా నుంచి నెలపాటు చమురు కొనుగోళ్లకు భారత్‌కు అనుమతిని ఇస్తున్నామని బహిరంగంగా ప్రకటించి చిన్నబుచ్చినా ఏమీచేయలేని అశక్తత ఆవరించింది. చైనా లాగా భారత్‌ని ఆర్థికంగా ఎదగనీయబోమనే అర్థంలో అమెరికా విదేశాంగశాఖ సహాయమంత్రి క్రిస్టొఫర్ లాండో ఈనెల 5న ఢిల్లీలో ప్రకటించినా గట్టిగా, సూటిగా, నిక్కచ్చిగా ఖండించలేని నిర్బలతే కన్పించింది. భారత--అమెరికా వ్యాపార సంబంధాలపై ఏర్పాటైన చర్చావేదికపైనే ఎటువంటి మొహమాటం లేకుండా లాండో ఆ ప్రకటన చేశారు. అమెరికాను మరోమారు గొప్పదేశంగా మారుస్తామనే నినాదాన్నీ విధానాన్నీ అందిపుచ్చుకున్న తర్వాత సంభాషణల్లో, ప్రకటనల్లో ఔచిత్యాలను ఆ దేశ నాయకులు పట్టించుకోవటం లేదు. వస్తుసేవల్లో నాణ్యతను మెరుగుపరచటానికీ, నవ్యతను తీసుకురావటానికీ, కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటానికీ వ్యాపారరంగంలో పోటీతత్వానికి మించిన ప్రత్యామ్నాయం లేదని ఒకప్పుడు ఇంటాబయటా వినిపించిన వాదనలు ఇప్పుడు కనీసం మాటమాత్రంగానైనా ప్రస్తావించటం లేదు. అమెరికాకు పూర్వవైభవాన్ని తేవటానికి ఏ దుశ్చర్యకైనా దిగుతామనే ధోరణే ఇప్పుడు వినిపిస్తోంది. దేశాల మధ్య తలెత్తే సమస్యల పరిష్కారానికి మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన నానాజాతి సమితిని హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలు పట్టించుకోలేదు. విజేత రాజ్యాలన్నీ కలిసి ఏర్పాటుచేసిన సంస్థను ఎందుకు లెక్కపెట్టాలన్న ధోరణితో దాని నిబంధనలన్నిటినీ ధిక్కరించి హిట్లర్ యూరప్‌లో ఒక్కోరాజ్యాన్ని చెరబట్టారు.

రెండో ప్రపంచయుద్ధం తర్వాత స్వయంగా అమెరికా ప్రోద్బలంతో ఏర్పాటైన ఐక్యరాజ్యసమితికీ ఇప్పుడు అదేస్థితి వచ్చింది. తేడా అల్లా ఒక్కటే. స్థాపించిన వారే ఇప్పుడు దాని అస్తిత్వాన్ని లెక్కచేయటం లేదు. ఐక్యరాజ్యసమితికి సమస్యలు తీసుకెళ్లకుండా, అందులో చర్చలు లేకుండా యుద్ధాలను ప్రకటించటమూ, రాజ్యాధినేతలను ఎత్తుకుని పోవటమూ, హతమార్చటమూ అమెరికాకు ఇప్పుడు రివాజుగా మారింది.

అమెరికాకు భూభాగం కొరత ఎప్పుడూ లేదు. విస్తీర్ణం పరంగా ప్రపంచంలో మూడోస్థానంలో ఉంది. వనరులపరంగానూ లోటులేదు. కానీ విస్తరణకాంక్షతోనే మొదటినుంచీ తన్నుకులాడుతోంది. క్యూబా విషయంలో అది మరింత నిజం. క్యూబాను స్పెయిన్ నుంచి కొనుగోలు చేయటానికి ప్రయత్నాలూ చేశారు, ఆక్రమించుకోటానికి పావులూ కదిపారు. థామస్ జఫర్‌సన్ అమెరికా అధ్యక్షుడిగా (1801--1809) ఉన్నప్పుడే ఈ వ్యవహారాలు నడిచాయి. స్పెయిన్ వాటిని పడనీయలేదు. లాటిన్ అమెరికాలో మిగతా దేశాలపై పెత్తనాన్ని 1820ల నాటికే వదులుకోవాల్సి వచ్చినా క్యూబాపై పట్టును వీడలేదు. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో ఆనాడు క్యూబా అగ్రస్థానంలో ఉండటమే అందుకు కారణం. 19వ శతాబ్దంలో సామ్రాజ్యశక్తిగా స్పెయిన్ ప్రాబల్యం క్షీణించిపోయింది. అదే సమయంలో క్యూబన్ జాతీయవాదులు బలం పుంజుకున్నారు. స్పెయిన్‌పై యుద్ధానికీ దిగారు. విస్తరణకాంక్షతో ఉన్న అమెరికాకు అది చక్కని అవకాశంగా పరిణమించింది. జాతీయవాదుల పక్షాన స్పెయిన్‌తో యుద్ధానికి దిగింది. స్పెయిన్ ఓడిపోయింది. క్యూబాకు స్వాతంత్ర్యం లభించింది. అయితే ఆ సంతోషం కొద్దికాలం కూడా నిలవలేదు. అన్నింటా తనకు లోబడి ఉండాలనే షరతులను అమెరికా విధించింది. అనుకూల వ్యాపార ఒప్పందాలను క్యూబాపై రుద్దింది. సముద్రతీరం పక్కనే ఉన్న క్యూబాకు చెందిన 'గ్వాంటానమో--బే'నీ అప్పుడే స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ అమెరికా సైనికస్థావరం అక్కడే ఉంది. పేరుకు స్వతంత్రదేశమైనా అమెరికాను ఎదిరించలేని క్యూబా నిజానికి వలస ప్రాంతంగానే ఉండిపోయింది. 1898 నుంచి

## రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్..

మొదటిపేజీ తరువాయి

వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
కార్మిక శాఖకు రూ.998 కోట్లు
మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు
ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు
ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
కల్యాణ లక్ష్మీ పథకం.. రూ.3,683 కోట్లు
ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు
మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు
మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు
రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు
గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు
వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు
మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు
ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు
చేయూత పథకం.. రూ.14,861 కోట్లు
రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు
ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు

### అమెరికా ఎఫ్-35ని

# ఢీకొట్టామిలా..

మొదటిపేజీ తరువాయి

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక యుద్ధ విమానాలను కోల్పోతోంది. తాజాగా ఎఫ్-35 యుద్ధ విమానాన్ని ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. "మా గగనతల రక్షణ వ్యవస్థ అర్ధరాత్రి దాటిన తర్వాత యూఎస్ సైన్యానికి చెందిన ఎఫ్-35 యుద్ధ విమానాన్ని దెబ్బతీసింది. అది ఏ స్థాయిలో దెబ్బతిన్నదనే దానిపై దర్యాప్తు చేస్తున్నాం. అది పూర్తిగా ధ్వంసం కావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి" అని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. అలాగే గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్నట్టుగా ఉన్న వీడియోను రిలీజ్ చేసింది.

మరోవైపు ఇదే ఘటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఇరాన్ యుద్ధంలో భాగమైన ఫైటర్ జెట్ ఒకటి అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అది సురక్షితంగా దిగిందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.

ఎఫ్-35ని క్షిపణుల వంటివి తాకి ఇలా ఎమర్జెన్సీ ల్యాండ్ అవడం ఇదే తొలిసారి. ఈ ఫైటర్ జెట్ విలువ వందల కోట్లలోనే ఉంటుంది. దీని కనీస విలువ రూ.82.5 మిలియన్ డాలర్లు (రూ.769 కోట్లకు పైగానే)గా ఉంది.

# గోదావరిలో ఐదుగురు గల్లంతు

మొదటిపేజీ తరువాయి

భద్రాచలం,మార్చి 20 (ఆర్ఎన్ఎ): గోదావరి నదిలో స్నానానికి వెళ్లినవారిలో ఐదుగురు యువకులు గల్లంతుకాగా.. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగతా ముగ్గురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సరిహద్దు ప్రాంతం కూనవరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అమరావతిలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు కూనవరం రోడ్డులోని గోదావరి నదిలో స్నానాలు చేసేందుకు దిగారు. నది లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తూ వారిలో ఐదుగురు యువకులు గల్లంతవగా, మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకొన్నారు. గమనించిన స్థానికులు వారికోసం బోట్లపై వెళ్లి గాలింపు చర్యలు చేపట్టగా.. చారుగుండ్ల శ్రీకర్ (భద్రాచలం), పొడిచేటి అభిరామ్ (భద్రాచలం) మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురు గోక తేజ (ఉయ్యూరు), నవదీప్ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లి) కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గోదావరి ఘటనపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. భవిష్యత్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.

# శ్రీవారికి 20 లక్షల విరాళం అందచేత

మొదటిపేజీ తరువాయి

తితిదే ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం అందింది. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కుమారుడు అరణి మదన్ మోహన్ తమ జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున తితిదే శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలను విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన ముత్తా గౌతమ్ దంపతులు తితిదే శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీలను అందజేశారు.

## మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం.. సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు

మొదటిపేజీ తరువాయి

కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని కోర్టుకు వివరించారు.గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23(సోమవారం)కి వాయిదా వేసింది.

## రానున్న 24 గంటల్లో ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు

మొదటిపేజీ తరువాయి



విశాఖపట్నం: పశ్చిమ బంగాళాఖాతం సమీప ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. రానున్న 24 గంటల్లో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని జిల్లాల్లో జల్లులు పడే అవకాశముంది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి గాలులు వీచే అవకాశం ఉన్నట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు చెప్పారు. గంగా పరివాహక ప్రాంతంలోని బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోనూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు చెప్పారు.

# ముగిసిన రంజాన్ ఉపవాసాలు

మొదటిపేజీ తరువాయి

ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

### మరోమారు పెరిగిన

# బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ.650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.600ల మేర పెరిగి రూ.1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ.1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,50,930గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర రూ.1,38,990గా ఢిల్లీలో రూ.1,38,500 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,38,350గా ఉంది. దేశంలోని పలు నగరాల్లో వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి చెన్నైలో రూ.2,64,900గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. ఇకపోతే మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం అద్భుతమైన రికవరీని సాధించాయి. ఆరంభంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లు, నిఫ్టీ 23,300 పాయింట్ల మార్కును దాటి దూసుకుపోయాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న మార్కెట్లలో షేర్లు తక్కువ ధరకే లభిస్తుండటంతో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఆఎఐబ), రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు చేపట్టారు. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లకు బలాన్ని ఇచ్చింది. ఇది భారత మార్కెట్లలో కూడా ఉత్సాహాన్ని నింపింది. ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాలు అగ్రగామిగా నిలిచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి బ్లూ-చిప్ షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

మొదటిపేజీ తరువాయి

అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు,



మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెటట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ,

గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళ్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం కోస్తాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో పాటు మోస్తరు వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

## మద్దిమడుగు రేంజ్ పరిధిలో మేకల కాపరి పై ఎలుగుబంటి దాడి

**- ఆదివాసి పెంటకు చెందిన ప్రశాంత్ కి తీవ్ర గాయాలు**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం ప్రజల మండలం పెట్రాల్ చేను గ్రామానికి చెందిన చిగుళ్ల ప్రశాంత్ పై మద్దిమడుగు రేంజ్ పరిధిలో ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం ప్రశాంత్ మేకలను మేత కోసం అడవి ప్రాంతంలోకి వెళ్లి అక్కడ ఉన్నటువంటి కుంకుడు కాయలు స్వీకరిస్తుండగా అడవి ప్రాంతంలో పిల్లలతో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా ప్రశాంత్ పై దాడి చేసింది. ఈ ప్రమాదంలో అతని కుడి చేతికి బలమైన గాయాలైనట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రశాంత్ తో పాటు ఉన్నటువంటి మరో ఇద్దరు పెద్ద కేకలు వేయడంతో ఎలుగుబంటి ప్రశాంత్ ను వదిలి వెళ్ళిందని తెలిపారు. 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ప్రశాంత్ కు ప్రథమ చికిత్స అందించి ఆ తర్వాత అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కి వెళ్లాలని వైద్యులు చెప్పడంతో ఆర్డిటి సంస్థ సహకారంతో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను విడుదల చేసిన గ్రామస్తులు

**జిల్లాస్థాయి లో మహిళలకు కోలాటం పోటీలు,పురుషులకు భజన పోటీల నిర్వహణ**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయని శ్రీ సీతారామాంజనేయ దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు విడుదల చేశారు. ఈనెల 27వ తేదీ రోజు శ్రీరామనవమి సందర్భంగా మాచారం గ్రామంలో శ్రీ సీతారామాంజనేయ ఆలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం జరుగు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అశేషజన సందోహంలో జరుగుతుంది. కావున నియోజకవర్గంలోని ప్రజలందరూ స్వామివారి కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. అదేవిధంగా శ్రీరామనవమి సందర్భంగా మహిళల కోసం జిల్లా స్థాయి కోలాటం పోటీలు అలాగే పురుషుల కోసం అడుగుల భజన పోటీలు నిర్వహించబడునున్నాయి. కావున అధిక సంఖ్యలో కోలాటం బృందాలు, భజన బృందాలు జిల్లా స్థాయి నుండి పాల్గొని నగదు బహుమతిని అందుకోగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం మహోత్సవంలో పాల్గొన్న బాణాల గ్రామ సర్పంచ్


**రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ బల్మూరు మండలం బాణాల గ్రామంలో డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఈరోజు నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నాగటి సురేష్ ఇల్లును బాణాల గ్రామ సర్పంచ్ మూడవత్ దేశ్య నాయక్ గారు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో గృహప్రవేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రెండో విడత ఇంకా కొన్ని రోజులలో రాబోతుందని తెలిపారు. అలాగే పేదవారి గృహ నిర్మాణ కోరిక నెరవేరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మరియు అచ్చంపేట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు

**- మహిళా సిబ్బందికి చీరల పంపిణీ**



అపర భద్రాద్రిగా పేరుపొందిన శ్రీ ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు చీరలు పంపిణీ చేశారు. శుక్రవారం ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు మహిళా సిబ్బందికి ఆయన స్వంత నిధులతో కొనుగోలు చేసిన చీరలను అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఆలయ సిబ్బందికి చిన్న కానుకగా చీరలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాల పరమేష్, నారాయణ రెడ్డి మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

**- డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**




సెయింట్ తెరెసాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో "అకాడెమిక్ ఎక్సెలెన్స్ అవార్డు" ప్రదానోత్సవ కార్యక్రమంలో హన్మకొండ డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆత్మకూరు విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు మరియు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ తెరెసాస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏర్పాటు చేసిన "అకాడెమిక్ ఎక్సెలెన్స్ అవార్డు" ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ సర్ జయిాస్ ఆహ్వానం మేరకు విచ్చేసిన ఇనగాల,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వయంగా అవార్డులు, ప్రైజులు అందజేసి,పిల్లలను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల ప్రాక్టీస్ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 'క్రికెట్ లాంజ్'ను ఆయన ప్రారంభించారు. పాఠశాలలో అత్యాధునిక వసతులు కల్పిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ విద్యార్థి జీవితంలో కీలకమని, పాఠశాల దశ నుండే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను అలవర్చుకుని దేశానికి గర్వకారణంగా ఎదగాలి అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పర్వతగిరి మహేశ్వరి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ గ్యాస్ ఏజెన్సీలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎమ్మార్వో

**- బ్లాక్ లో సిలిండర్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని గ్యాస్ ఏజెన్సీ లపై రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అమ్రాబాద్ మండల కేంద్రంలో ఉన్నటువంటి ఇండియన్ గ్యాస్ శివ ఏజెన్సీలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టి గోదాంలో ఉన్న స్టాక్ లెక్కపెట్టిన అధికారులు డొమెస్టిక్ సిలిండర్లు బ్లాక్ లో అమ్మినట్లయితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో రాములు మాట్లాడుతూ హోటల్స్ మరియు రెస్టారెంట్లలో ఉన్న లెక్కకు మించిన సిలిండర్లను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ మండల రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్-స్పెక్టర్ కృష్ణ మరియు జిపిఓ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## టీవీ5 ఉగాది పంచాంగం ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్

**స్థానిక నాయకులు మరియు జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఆవిష్కరణ**



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ వార్తా సంస్థ టీవీ5 ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది పంచాంగం పుస్తకాన్ని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలలో పంచాంగానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ప్రజలకు రాశి ఫలాలు, తిథి, నక్షత్రాల సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంత్రాల లాలు యాదవ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు చారకొండ బాలకృష్ణ మరియు జర్నలిస్ట్ మంత్రాల శ్రీనివాస్, ప్రముఖులు పాల్గొని అచ్చంపేట నియోజకవర్గం ప్రజానీకానికి మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, పాత్రికేయులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా చలమాల వర్ధంతి



పెనుబల్లి మండల కేంద్రంలోని వి ఎం బంజర్ లో చలమల గంగాధర్ వర్ధంతి శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా గంగాధర్ స్తూపం వద్ద సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి జెండాని ఆవిష్కరించి నివాళులర్పించారు గంగాధర్ చిత్రపటానికి వీఎం బంజర సర్పంచ్ భూక్య ప్రసాద్ పూలమాల వేశారు మండల కార్యదర్శి గాయం తిరపతి రావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో శీలం మాట్లాడుతూ పేదలకు ఇస్తున్న పథకాలపై మరిన్ని రాయితీలు ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారని ఆయన ఆరోపించారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు నిరంతర పోరాటం చేయడం ద్వారానే ఉపాధి హామీ చట్టం అటవీ హక్కుల చట్టం వంటి ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతం చేయగలిగామన్నారు సాధించిన హక్కులను నేడు కేంద్ర ప్రభుత్వం కాల రాస్తుందని ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మేధావులు ప్రజాసంఘాలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు వి ఎం బంజర్ ఉపసర్పంచ్ తాళ్లూరు రవి నాయకులు చిట్టి మోదుల కృష్ణయ్య చెమట విశ్వనాథం కండే సత్యం మిట్టపల్లినాగమణి చలమాల నరసింహారావు మేకల బాజీ కలకోట వెంకటేశ్వర్లు వడ్డేపల్లి రవీంద్ర దండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

## గోదావరిలో విషాదం.. 5 మంది బీటెక్ విద్యార్థులు గల్లంతు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో గోదావరి నదిలో జరిగిన విషాద ఘటనలో ఐదుగురు బీటెక్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన వీరు నదిలో స్నానాలకు దిగగా ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అమరావతి లోని ఎస్ఆర్ఎంటీ, కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి ఎటపాక మండలం లోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలోని గోదావరి నది లోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. ఇందులో అభిరామ్, శ్రీకర్ భద్రాచలం ప్రాంతానికి చెందినవారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిస్క్యూ బృందం కూడా మృతదేహాల కోసం గాలిస్తోంది.

## బడ్జెట్ లో విద్యా రంగానికి కేటాయింపులు ఏవి??

**- జే.బీ.పీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేలా ఉందని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు. బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యా రంగానికి 15 శాతం నిధులను బడ్జెట్ లో కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 8.2 శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని, ఈ అరకొర నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవని విమర్శించారు. 3,24,234 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వైద్య రంగానికి కేవలం 13679 కోట్లను మాత్రమే కేటాయించి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని, జాబ్ క్యాలెండర్ పై ప్రస్తావించలేదని, ఆరు గ్యారంటీ ల అమలు పై బడ్జెట్ లో ఎక్కడ ప్రస్తావన లేదని, ఉద్యోగాలకు సంబంధించిన పీఆర్సీ పై ప్రకటన లేకపోవడం దారుణమన్నారు. రాజీవ్ యువ వికాసానికి పోయిన బడ్జెట్ లో 6 వేల కోట్లు కేటాయించి 6 పైసలు కూడా ఖర్చు చేయలేదని దెప్పిపొడిచారు. ఈ బడ్జెట్ అంకెల గారడి తప్ప సామాన్య, పేద ప్రజలకు వొనగూరింది ఏమి లేదని విమర్శించారు.

# ఈ బడ్జెట్ పూర్తిగా బీసీ వర్గాలను మోసం చేసే చేసేలా ఉంది

**– ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఈకాలం, ఆదిలాబాద్**
గత 9 సంవత్సరాల టీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ బీసీలకు న్యాయం జరగలేదని, ఈ బడ్జెట్‌లో బీసీల గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను మోసం చేసేలా ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కనీసం రూ.1 లక్ష వరకు సబ్సిడీ రుణాలు లభించేవని, కానీ ప్రస్తుతం తెలంగాణలో బీసీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. రాష్ట్ర ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు సకాలంలో అందకపోతుండగా, విమాన ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 కోట్లు ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టే చర్యగా అభివర్ణించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఫసల్ భీమా యోజన అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పథకానికి రూ.23,000 కోట్ల కేటాయింపులు ప్రకటించినప్పటికీ, వాస్తవ ఖర్చు కేవలం రూ.3,000 కోట్లకు పరిమితమైందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గత మూడు బడ్జెట్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని
ఆక్షేపించారు. బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చుల మధ్య ఎలాంటి సంబంధం లేకపోవడం ఆందోళనకరమని, కేవలం 25% మాత్రమే ఖర్చు చేయడం అన్యాయమన్నారు. విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం భవిష్యత్ తరాలకు నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు.
బీసీ సబ్ ప్లాన్ నిధులను సరైన విధంగా వినియోగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో ఉన్న లోపాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పార్టీ అసెంబ్లీ లోపల, బయట గట్టిగా పోరాడుతుందని, బీసీలు, రైతులు, ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.
..................

# బీసీలను మోసం చేసే బడ్జెట్!

**– ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఈకాలం, ఆదిలాబాద్**
గత 9 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ బీసీలకు న్యాయం జరగలేదని, ఈ బడ్జెట్‌లో బీసీల గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను మోసం చేసేలా ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కనీసం రూ.1 లక్ష వరకు సబ్సిడీ రుణాలు లభించేవని, కానీ ప్రస్తుతం తెలంగాణలో బీసీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. రాష్ట్ర ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు సకాలంలో అందకపోతుండగా, విమాన ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 కోట్లు ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టే చర్యగా అభివర్ణించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ఫసల్ భీమా యోజన అమలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్ల నిర్మాణ పథకానికి రూ.23,000 కోట్ల కేటాయింపులు ప్రకటించినప్పటికీ, వాస్తవ ఖర్చు కేవలం రూ.3,000 కోట్లకు పరిమితమైందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గత




మూడు బడ్జెట్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని
ఆక్షేపించారు. బడ్జెట్‌లో కేటాయింపులు, ఖర్చుల మధ్య ఎలాంటి సంబంధం లేకపోవడం ఆందోళనకరమని, కేవలం 25% మాత్రమే ఖర్చు చేయడం అన్యాయమన్నారు. విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం భవిష్యత్ తరాలకు నష్టం కలిగిస్తుందని హెచ్చరించారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను సరైన విధంగా వినియోగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో ఉన్న లోపాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పార్టీ అసెంబ్లీ లోపల, బయట గట్టిగా పోరాడుతుందని, బీసీలు, రైతులు, ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

# సంక్షేమానికి పెద్దపీట

**– డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్**

**ఈకాలం,ఆదిలాబాద్**
తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ పూర్తిగా సామాన్య, పేద ప్రజల పక్షపాతిగా ఉందని డాక్టర్ నరేష్ జాదవ్ కొనియాడారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి దార్శనికతకు ఈ బడ్జెట్ అద్దం



పడుతోందని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా మొత్తం రూ.3,24,234 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి, అలాగే విద్య, సాగునీటి రంగాలకు బడ్జెట్‌లో సింహభాగం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం
ఇస్తున్నప్రాధాన్యతస్పష్టమవుతోందన్నారు. పేద ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ.. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కవరేజీని అందించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" తీసుకురావడం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ నిర్ణయం అని ఆయన ప్రశంసించారు. ?అలాగే, పేద విద్యార్థుల ఆకలి తీర్చే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా విస్తరించడం గొప్ప పరిణామం అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతాయని, తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విద్య.ఉద్యోగులకు అన్యాయం!

**– పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్**

**ఈకాలం, ఆదిలాబాద్**
ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ లో విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయ రంగాలకు అన్యాయం జరిగిందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, ఐదు డిఏలు పెండింగ్ లో ఉన్నాయని వాటి ప్రస్తావన లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఇప్పటికే పీఆర్సీ అమలులో 33 నెలలు ఆలస్యమైందని ఆరు నెలల్లో మంచి పిఆర్సి అమలు చేస్తామని మేనిఫెస్టో లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ.1056 కోట్లు కేటాయింపును స్వాగతిస్తున్నామని, అవి దారి మల్లకుండా చూడాలని కోరారు. 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు



మాత్రమేనని ఇది మొత్తం బడ్జెట్లో 8.2 శాతమని ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన మంచిదే అయినా గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు విటన్నిటి కోసం సరిపోకపోవచ్చని తెలిపారు. విద్యకు 15% కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా 3వ బడ్జెట్లో కూడా నెరవేరలేదని చెప్పారు.

# జనాలచేతుల్లో గుండుసున్నా!

**– మాజీ మంత్రి, జోగు రామన్న**

**ఈకాలం, ఆదిలాబాద్**
కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం తెలంగాణ ప్రజల చేతుల్లో గుండు సున్నా పెట్టిందని మాజీ మంత్రి జోగు రామన్న అభిప్రాయపడ్డారు. బడ్జెట్పై ఇలా చెప్పుకొచ్చారు.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాళ్ళ కోసం



కమిషన్ బడ్జెట్ తప్ప ప్రజల సంక్షేమ బడ్జెట్ కాదు.. అన్ని వర్గాల ప్రజలను రైతులను మహిళలను ఉద్యోగులను యువతను మోసం చేసేలా ఉంది.. ప్రతి కులస్తులకు కార్పొరేషన్ ప్రకటిస్తామని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మొండి చేయి చూపగా మైనార్టీలకు సైతం నామమాత్రంగా నిధులు కేటాయించడం సిగ్గుచేటు. ఉద్యోగుల పిఆర్సి రిటైర్మెంట్ బెనిఫిట్స్ , జాబ్ క్యాలెండర్, ఇరిగేషన్,విద్యా విధానం, సంస్కరణలు అన్ని బూటకం మాటలేనని ఈ బడ్జెట్ లో నిరూపితమవుతోంది. మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కక్కుర్తి కి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఇరిగేషన్ పై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం రైతాంగాన్ని విస్మరించిందని పేర్కొన్నారు.

# నైపుణ్యాలను పెంచుకోవాలి!

**– జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఈకాలం, ఆదిలాబాద్**
మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవనంలో 'తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్' ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో 'టాస్క్' ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన టెక్నికల్, నాన్-టెక్నికల్ కోర్సులలో ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందని, ?అలాగే, కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ , ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని యువత ఈ ఉచిత, నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.
?ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధికల్పన అధికారి మిల్కా, ఈడియం బండి రవి, టాస్క్ మేనేజర్ సాయి, బోధన సిబ్బంది, యువతీ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలు లేని అసమర్ధ బడ్జెట్

**– బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్**



**ఈకాలం, ఆదిలాబాద్**
అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలయినా ఆరు గ్యారంటీలను అమలు చేయకపోగా, అసమర్ధ బడ్జెట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ ప్రవేశపెట్టిందని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అన్నెల లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవసరమయ్యే మౌలిక విద్య, వైద్య, ఉపాధి రంగాలకు తగినంత బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. ఆచరణకు సాధ్యంగానే హామీలిచ్చి అప్పుల ఊబిలో రాష్ట్రాన్నీ తెలంగాణ ప్రజలను అప్పుల పాలు చేసిన ఘనత నాడు బిఆర్ఎస్ ది అయితే నేడు కాంగ్రెస్ ది అని ఎద్దేవ చేశారు. ప్రభుత్వం విద్య వైద్య ఉపాధి రంగాలలో 90% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు ప్రత్యేక బడ్జెట్ వారి సంక్షేమం కోసం కేటాయిస్తే బాగుండేదని అన్నారు. ఎప్పటిలాగే భట్టి సాంప్రదాయ బడ్జెట్ ప్రవేశపెట్టారని ఈ పసలేని బడ్జెట్ తో ప్రజలకు ఓన గోరిందేమి లేదని అన్నారు. పేదలైన బీసీ ఎస్సీ ఎస్టీలకు అధికారం వచ్చినప్పుడే తెలంగాణలో ఉన్న మూడున్నర కోట్ల మంది అట్టడుగు అనగారిన వర్గాలైన బహుజనులకు బడ్జెట్ లోను సంపూర్ణ న్యాయం జరుగుతుందని తెలిపారు.

Eekalam News, printed and published by Devender Nukala, eekalam publications, printed at sunday printing press, h.no.361, bhagyalaxmi colony, medchal malkaj-giri, telangana 500054. Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149